క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మైదుకూరు: కడపలోని 220 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మైదుకూరుకు వచ్చే ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా మంగళవారం, బుధవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ రామభద్రయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రశాంత ఎన్నికలే లక్ష్యం



కవాతు నిర్వహిస్తున్న సాయుధ బలగాలు

ప్రొద్దుటూరు క్రైం: ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యమని త్రీటౌన్ టౌన్ సీఐ వెంకటరమణ ప్రకటించారు. సోమవారం ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ ఆదేశాల మేరకు పట్టణంలోని రాజీవ్ సర్కిల్, టీబీ రోడ్డు, విజయకుమార్ సర్కిల్, బొల్లవరం, తిమ్మయ్య కాలనీ, జంగంపేట ప్రాంతాల్లో సీఆర్‌పీఎఫ్ కేంద్ర బలగాలతో ఫ్లాగ్ మార్చ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి అపోహలకు గురికావద్దని, ప్రజలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత పోలీసులదేనని, ప్రతిఒక్కరూ నిర్భయంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

ఖాజీపేట : మండలంలోని దుంపలగట్టు గ్రామానికి చెందిన శంకరయ్య (38) అనే సన్నకారు రైతు అప్పుల బాధతో బలవన్మరణానికి పాల్పడ్డాడు. శంకరయ్య సొంత పొలం 1.20 ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలు తీసుకొని పూల తోటలు వరి సాగు చేశాడు. అయితే దిగుబడులు రాక, గిట్టుబాటు ధరలు అందక నష్టాల్లో కూరుకుపోయాడు. సుమారు రూ 10 లక్షల మేరకు అప్పులు చేశాడు. అప్పులు తీర్చేదారి లేక తీవ్ర మనస్తాపానికి గురయి ఆదివారం ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబసభ్యులు గమనించి చికిత్స నిమిత్తం కడప రిమ్స్‌కు తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం పట్టివేత



మద్యం సీసాలతో పట్టుబడ్డ వ్యక్తితో సీఐ

పోరుమామిళ్ల: పట్టణ శివారులోని సీతారామపురం క్రాస్‌రోడ్డు వద్ద సోమవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా మద్యం తరలిస్తున్న పెద్ద యరసాలకు చెందిన ఎర్రంశెట్టి సుబ్రమణ్యం అనే వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు సీఐ చిరంజీవి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 20 మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం కావాలి



ప్రచారం చేస్తున్న నాగార్జునరెడ్డి

పోరుమామిళ్ల: మళ్లీ జగనన్న సీఎం అయితే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని, రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుందని పీఆర్ఆర్‌డీ రాష్ట్ర సలహాదారు నాగార్జునరెడ్డి అన్నారు. ముసల్‌రెడ్డిపల్లె పంచాయతీ కొత్తూరు హరిజనవాడలో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అవినాష్‌రెడ్డిని ఎంపీగా, డాక్టర్ సుధాను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ డాక్టర్ మాబు, పార్టీ నాయకులు సుబ్బరాయుడు, ఎర్రన్న, బాలశౌరిపాల్గొన్నారు.

వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుట్ర

చాపాడు: గ్రామ వలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుట్ర చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు అయ్యవారిపల్లె మాధవరెడ్డి సోమవారం ప్రకటనలో ఆరోపించారు. టీడీపీ కుట్రలో భాగంగా రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కోర్టుకు వెళ్లి వలంటీర్లను ఎన్నికల విధులకు దూరం చేశారన్నారు. అలాగే సామాజిక ఫించన్లు వలంటీర్లు పంపిణీ చేయడంపై ఆయన కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని మండిపడ్డారు. ఒకటో తేదీన ఫించన్ అందకపోవడంతో వృద్ధులు, వితంతువులు, వికలాంగులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో పెన్షన్ తీసుకుంటున్న ప్రతి ఒక్కరూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

చలివేంద్రం ఏర్పాటు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక గాంధీ రోడ్డులోని సీఎస్ఆర్ ఆస్పత్రి వద్ద బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం బీకే శాంత, నాగమల్లేశ్వరరెడ్డి ప్రారంభించారు. బీకే శాంత మాట్లాడుతూ వారంలో రెండు రోజుల మజ్జిగ పంపిణీ చేస్తామని చెప్పారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

- సీఎం జగన్‌ను మళ్లీ గెలిపించండి
- ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్: అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా గడప గడపకూ సంక్షేమ పథకాలను అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మండల పరిధిలోని కోనసముద్రం పంచాయతీలోని కోనసముద్రం, జోగిరెడ్డిగారిపల్లె గ్రామాల్లో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు తన మేనిఫెస్టోలో 600 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఒక్క హామీని కూడా అమలు చేయకుండా ప్రజలను మోసగించారని మండిపడ్డారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మళ్లీ బూటకపు హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని, వారి మోసపూరిత హామీలను నమ్మవద్దని సూచించారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీల్లో 99 శాతం అమలు చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల తలరాతలను మార్చారని కొనియాడారు. విద్య, వైద్య రంగంతో పాటు మహిళా, రైతు సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అన్నారు. పేదలందరికి పారదర్శకంగా పథకాలు అంది వారి జీవితాలు మరింత మెరుగుపడాలంటే రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ద్వారానే అది సాధ్యమవు తుందని, ఈ విషయాన్ని ప్రజలంతా గమనించాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శులు రామసుబ్బారెడ్డి, పెద్దపోలిరెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి,మాజీ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షులు శేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ బాలసుందరం, సర్పంచ్‌లు జయసుబ్బారెడ్డి, కుప్పాల రమణ, కృష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, రామస్వామిరెడ్డి పాల్గొన్నారు.

నేడు ఇంటింటి ప్రచారం

గోపవరం: మండలంలోని బ్రాహ్మణపల్లె సచివాలయం పరిధిలోని సూరేపల్లె, వడ్డెపాలెం, బ్రాహ్మణపల్లె దళితవాడలో మంగళవారం ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజాప్రతినిధులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

వరదరాజులురెడ్డివి గల్లీ రాజకీయాలు



ఫొటోలను చూపిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నంద్యాల వరదరాజులరెడ్డి గల్లీ రాజకీయాలు మానుకోవాలని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి సూచించారు. టీడీపీలో ఉన్న వారికే ఆయన మళ్లీ కండువాలు కప్పుతున్నారని ఎద్దేవాచేశారు. 22వ వార్డు కౌన్సిలర్ మహమ్మద్ గౌస్ ఇప్పటికే టీడీపీలో ఉన్నారని, మళ్లీ ఆయనకు కండువా కప్పారన్నారు. కామిశెట్టి బాబు, పొట్టు లక్ష్మిరెడ్డి 2019 ఎన్నికల్లో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోసం పనిచేయలేదని తెలిపారు. ఉప్పాగులో పనికోసం వచ్చిన వారిని పిలిచి వరదరాజులరెడ్డి పార్టీ కండువాలు కప్పుతున్నారన్నారు. సమావేశంలో సోములవారిపల్లె ఉపసర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి, గోపవరం మాజీ సర్పంచ్ దేవీప్రసాదరెడ్డి, లాయర్ సుబ్బయ్య, నంగనూరుపల్లె శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆసరా అందక అవస్థలు పడుతున్న పండుటాకులు



ఇంటికే పరిమితమైన వృద్ధుడు ఊరిబిండి సుబ్బారెడ్డి

గోపవరం: అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఫించన్ అందక అవస్థలు పడుతున్నారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ ఫిర్యాదులో ఈసీ ఆదేశాల మేరకు ఎన్నికల కోడ్ ముగిసేదాక ఫించన్ల పంపిణీ నుంచి వలంటీర్లను పక్కనపెడుతూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో వలంటీర్లను ఎన్నికల కమిషన్ పక్కన పెట్టడంతో ప్రభుత్వమే సచివాలయాల వద్ద సామాజిక ఫించన్లు పంపిణీ చేయాలని నిర్ణయం తీసుకుంది. కొన్ని గ్రామాల్లో సచివాలయాలు రెండు మూడు కిలోమీటర్ల దూరం ఉన్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 55 నెలలుగా వలంటీర్ల ద్వారా ప్రతి నెల ఒకటో తేదీన సామాజిక ఫించన్లు అందజేసింది. అంతేకాకుండా ఆస్పత్రుల్లో చికిత్స తీసుకుంటున్న వారి వద్దకే వెళ్లి వలంటీర్లు ఫించన్ అందజేశారు. ఈ 55 నెలల్లో ఫించన్ కోసం లబ్ధిదారులు అవస్థలు పడలేదు. ఈ నెల 3వ తేదీ నుంచి సచివాలయాల వద్ద ఫించన్ పంపిణీ చేస్తామని ప్రకటించడంతో లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ప్రతి నెల ఒకటో తేదీ ఉదయాన్నే తలుపుతట్టి వలంటీర్లు చేతిలో ఫించన్ పెట్టేవారని ఇప్పుడు ఎక్కడో ఉన్న సచివాలయాలకు ఎండలో ఎలా వెళ్లాలని భయాందోళన చెందుతున్నారు. ఫించన్ పంపిణీ చేయకుండా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అడ్డుకోవడంతో వృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక రోగులు, వితంతువులపై కక్ష సాధించడమేనంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ ఉమారాణి

దువ్వూరు: మండలంలోని దువ్వూరు, సంజీవరెడ్డిపల్లె, పుల్లారెడ్డిపేట, గోపులాపురం, అన్నపుశాస్త్రులపల్లె, సంగటి తిమ్మాయపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం తహసీల్దార్ ఉమారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా పోలింగ్ కేంద్రాల్లో విద్యుత్, తాగునీరు, ర్యాంప్‌లు, టాయిలెట్లు తదితర మౌలిక సదుపాయాలపై ఆరా తీసి సిబ్బందికి సూచలిచ్చారు. అనంతరం ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్ల జాబితాను పరిశీలించి, ఓటు హక్కు లేని వారు ఎవరైనా ఉంటే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ జాన్సన్, డిప్యూటీ తహసీల్దార్ ఆలీఖాన్, ఈఓపీఆర్డీ శివప్రసాద్, వీఆర్‌ఓలు రమణారెడ్డి, ఖాలీద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

భగవద్గీత పఠనం.. మోక్ష ప్రదాయం



సైకిల్ యాత్ర చేస్తున్న నితిన్

ప్రొద్దుటూరు కల్చరల్: భగవద్గీత పఠనం మోక్ష ప్రదాయమని విద్యార్థి చింతలపూడి నితిన్ అన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయంలో బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన విద్యార్థి చింతలపూడి నితిన్ తిరుమల నుంచి విజయనగరానికి సైకిల్ యాత్ర ప్రారంభించారు. ఆయన సోమవారం ప్రొద్దుటూరుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలపై ఆసక్తి ఉన్న యువతను పరిచయం చేసుకుంటూ యోగా, భగవద్గీత పఠనం వారి దైనందిన జీవితంలో ఒక భాగంగా చేసుకోవాలని సూచిస్తున్నట్లు తెలిపారు. విజయనగరంలోని రామనారాయణ మందిరం దర్శనంతో యాత్ర ముగుస్తుందని తెలిపారు.

వ్యక్తి అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరంలోని రైల్వేస్టేషన్ సమీపంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న యూసఫ్ అనే వ్యక్తిని సీఐ సీ. భాస్కర్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి సోమవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 40 క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బైపాస్‌లో ఆర్చీ సమీపంలో వరదరాజులు అనే వ్యక్తి అక్రమంగా బీర్ బాటిళ్లను తరలిస్తుండగా సీఐ నరసింహారెడ్డి తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి 19 బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.

ప్రజా సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న రాజగోపాల్‌రెడ్డి, సుందర్‌రామిరెడ్డి

బద్వేలు అర్బన్: అన్ని వర్గాల సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టర్ జి.సుందర్‌రామిరెడ్డి పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డులోని పూసలవాడ, ముబారక్‌నగర్‌లో ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన మేలును ప్రజలకు వివరిస్తూ ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సుధను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు ఏనాడు పేదల సంక్షేమాన్ని పట్టించుకోలేదని విమర్శించారు. ఈ ఎన్నికల్లో మోసపూరిత హామీలతో ప్రజల వద్దకు వస్తున్నారని ఆయన మాటలను నమ్మవద్దని సూచించారు. పేదల జీవితాలు మరింత మెరుగుపడి పేదలందరికి సంక్షేమ పథకాలు అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవాలని అన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ కేశవరెడ్డి, వైవీయూ పాలకమండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, కౌన్సిలర్లు సత్యనారాయణ, రెడ్డెయ్య, నాగేశ్వర్‌రావు, చెన్నకృష్ణారెడ్డి, సాంబశివారెడ్డి, మౌలాలి, రఘురామిరెడ్డి, బాబు, రజనీకాంత్, చెంచయ్య,చరణ్, నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎస్.వెంకటేశ్వర్లు, యాదవ సంఘం అధ్యక్షులు రాజాయాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గోపవరం: మండలంలోని గోపవరం గ్రామ పంచాయతీలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం సోమవారం అధికారులు చర్యలు చేపట్టారు. చిన్నగోపవరం, పెద్దగోపవరం ఎస్టీకాలనీలో తాగునీటి సమస్యపై ఇటీవల ఇంటింటి ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ దృష్టికి ఆయా గ్రామాల ప్రజలు తీసుకువచ్చారు.

వెంటనే తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్‌తో పాటు సంబంధిత అధికారులను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఆదేశించారు. ఎమ్మెల్యే పనులు ప్రారంభించారు. అయినప్పటికీ తాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడంతో సమాచారం తెలుసుకున్న ఎంపీడీఓ రాధాకృష్ణన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవితేజ, ఈఓపీఆర్డీ హసీనాలు పంచాయతీ కార్యదర్శి విజయకుమార్‌ను వెంటపెట్టుకుని తాగునీటి పథకాలను పరిశీలించారు. బోర్లు వేసినప్పటికీ ఇంకా తాగునీటి సమస్య పరిష్కారం కాకపోవడానికి గల కారణాలు ఏమిటని స్వయంగా పరిశీలించారు. అవసరమైన చోట కొత్తగాపై పైపులైన్లు వేసి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శిలను కోరారు. తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వలంటీర్ల రాజీనామా



సెక్రటరీకి రాజీనామా పత్రాలు ఇస్తున్న వలంటీర్లు

ప్రొద్దుటూరు : టీడీపీ నేతలు కక్షపూరితంగా వ్యవహరించి ప్రజలకు సేవలు అందించే అవకాశం లేకుండా చేయడంతో గ్రామాల్లో, పట్టణాల్లో సచివాలయ వలంటీర్లు స్వచ్ఛందంగా తమ ఉద్యోగాలకు రాజీనామా చేస్తున్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశం లేనప్పుడు ఎందుకు ఈ ఉద్యోగాలంటున్నారు. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు మండల పరిధిలోని చెన్నమరాజుపల్లె వలంటీర్లు ఆదివారం రాజీనామా చేయగా, సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 28వ వార్డు వలంటీర్లు 23 మంది రాజీనామా పత్రాలను సచివాలయ అడ్మిన్ సెక్రటరీకి అందించారు. సంక్షేమ పథకాల రూపకర్త వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని తెలిపారు. అలాగే సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 90 మంది వలంటీర్లు తమ ఉద్యోగాలకు రాజీనామా చేశారు. ప్రజలకు సేవలు అందించలేని తమ ఉద్యోగాలు ఎందుకు ఈ సందర్భంగా వలంటీర్లు తెలిపారు.

బి.మఠంలో ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం



ప్రజల యోగక్షేమాలు తెలుసుకుంటున్న ఎంపీ, ఎమ్మెల్యే

బ్రహ్మంగారిమఠం: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఎంపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థి శెట్టిపల్లె రఘురామిరెడ్డి బ్రహ్మంగారిమఠంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీ, ఎమ్మెల్యేకు ఎంపీటీసీ అంకిరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకుడు కృష్ణారెడ్డి ఘనస్వాగతం పలికారు. అనంతరం కర్ణం సుబ్రమణ్యం ఇంటికి వెళ్లి చర్చించారు. అలాగే బి.మఠం దేవస్థానం పూర్వపు మఠాధిపతి కుమారుడు దత్తస్వామి ఇంటికి వెళ్లారు. నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో బి.మఠం నాలుగు రోడ్లు కూడలి కిక్కిరిసిపోయింది. మఠం పురవీధుల్లో ఎంపీ, ఎమ్మెల్యే ప్రచారం నిర్వహిస్తూ ప్రజల బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ సలహాదారుడు తిరుపాల్‌రెడ్డి, రాష్ట్ర ఉద్యానవన సలహాదారుడు ప్రసాద్‌రెడ్డి, మైదుకూరు మార్కెట్ యార్డు చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, బద్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గిద్దలూరు ఎన్నికల పరిశీలకులు బంగారు శ్రీను, జేసీఎస్ కన్వీనర్ యాదరెడ్డి, సోమిరెడ్డిపల్లె పంచాయతీ నాయకులు ఉమాపతి, మనోహరాచారి, గొడ్లవీడు సుబ్రమణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు విశ్వసించడం లేదు



ప్రచారం చేస్తున్న దేవసాని ఆదిత్యరెడ్డి

బి.కోడూరు: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును ప్రజలు విశ్వసించడం లేదని, టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రజా సంక్షేమాన్ని విస్మరించారని వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యరెడ్డి విమర్శించారు. సోమవారం మండలంలోని సిద్దుగారిపల్లె, కుమ్మరోనిపల్లె గ్రామాల్లో మండల అధ్యక్షుడు రామకృష్ణారెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వాలంటీర్ల వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు టీడీపీ కుట్ర చేస్తోందని మండిపడ్డారు. వలంటరీ వ్యవస్థ లేకపోతే ఫించన్ల పంపిణీలో తీవ్ర ఇబ్బందులు జరుగుతాయని తెలిపారు. టీడీపీ కుట్రలో భాగంగా రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ కోర్టుకు వెళ్లి వలంటీర్లను ఎన్నికల విధులకు దూరం చేశారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మునిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, తిరుపతిరెడ్డి, దుగ్గిరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, పోలిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామిరెడ్డి, పి.లక్ష్మీనరసారెడ్డి, ప్రహల్లాదరెడ్డి, బ్రహ్మారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, సుబ్బారెడ్డి, సిద్దారెడ్డి పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక

బద్వేలు అర్బన్: మండల పరిధిలోని తుమ్మలపల్లె పంచాయితీలోని కుమ్మరోనిపల్లె గ్రామంలో సోమవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈశ్వర్‌రెడ్డి, సాంబశివారెడ్డి, సుబ్బారెడ్డి పాటు 20 కుటుంబాలు వైఎస్సార్‌సీపీ యువ నాయకులు దేవసాని ఆదిత్యారెడ్డి సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆదిత్యారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనకు ప్రజలు పెద్ద ఎత్తున ఆకర్షితులవుతున్నారని అన్నారు. 2024 ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా గెలిస్తేనే పేదలకు మరింత మేలు జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. పార్టీలో చేరిన వారంతా సైనికుల్లా పనిచేసి మరోసారి బద్వేలులో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు జయరామిరెడ్డి, రామసుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనరసారెడ్డి, తిరుపతిరెడ్డి, నాయకులు శంకర్‌రెడ్డి, పోలిరెడ్డి, రామసుబ్బారెడ్డి, రామిరెడ్డి, పి.లక్ష్మీనరసారెడ్డి, ప్రహల్లాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల మనోభావాలను దెబ్బతీయొద్దు



సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు తదితరులు

ప్రొద్దుటూరు క్రైం: రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్యుల మనోభావాలను దెబ్బతీసేలా మాట్లాడటం మంచిది కాదని జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఆనంద్‌బాబు సూచించారు. స్థానిక జిల్లా ఆస్పత్రిలో పలు అసోసియేషన్లతో కలిసి సోమవారం వైద్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ శుక్రవారం ఆస్పత్రికి వచ్చిన మహిళా పేషెంట్‌కు చికిత్స చేయలేదని కొందరు వ్యక్తులు అసత్య ఆరోపణలు చేశారన్నారు. ఆ రోజు క్యాజువాలిటి డ్యూటీలో ఉన్న డాక్టర్ నాగమల్లేశ్వరి తనకు ఫోన్ చేసి పేషెంట్‌కు ట్రీట్‌మెంట్ ఇచ్చినా కొంత మంది వ్యక్తులు వచ్చి తనను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారని తెలిపారు. భయపడవద్దని, మహిళకు అవసరమైన వైద్యం చేయమని డాక్టర్‌తో చెప్పినట్లు పేర్కొన్నారు. కొంత సేపటి తర్వాత తాను ఆస్పత్రికి వెళ్లగా శివకృష్ణ అనే వ్యక్తి కొంత మంది వ్యక్తులతో క్యాజువాలిటీలోకి వచ్చాడన్నారు. మహిళకు ఎందుకు ట్రీట్‌మెంట్ చేయరంటూ దబాయిస్తూ తనను ప్రశ్నించినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. డాక్టర్ ట్రీట్‌మెంట్ ఇస్తున్నారని, ఈ విషయాన్ని సంబంధింత పేషెంట్ కుటుంబ సభ్యులకు చెప్పామన్నారు. అంతేగాని అతనితో ఎలాంటి దుర్భాష లాడలేదని తెలిపారు. శివకృష్ణ అనే వ్యక్తి ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ పేరుతో తన వద్దకు వచ్చి పలుమార్లు డొనేషన్లు అడిగాడని, కానీ తాను ఇవ్వలేదన్నారు. ఈ విషయాన్ని అతను మనసులో పెట్టుకొని ప్రతి దాన్ని ఇష్యూ చేస్తున్నాడన్నారు. వైద్యం చేస్తున్న వైద్యులను బెదిరించడం తగదని, ఈ విషయమై తమ ఉన్నతాధికారులతో పాటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు మెడికల్ సూపరింటెండ్ తెలిపారు. ఎన్జీఓ ప్రెసిడెంట్ కేజే రఘురామిరెడ్డి మాట్లాడుతూ రోగులకు సకాలంలో వైద్యం అందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉంటుందన్నారు. అయితే ఆస్పత్రికి వచ్చి వైద్యులను బెదిరించి వారిపై ఒత్తిడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. ఇలాంటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. డాక్టర్ టి. నాగమల్లేశ్వరి, ఏపీజీఈఏ సెక్రటరి రామచంద్రయ్య, హంస జిల్లా ప్రెసిడెంట్ డి రాజారత్నం, ఏఐటీయూసీ పట్టణాధ్యక్షుడు హరి, ఎన్జీఓ సెక్రటరి ప్రమీలా పాల్గొన్నారు.

దేవాంగులను విస్మరించడం దారుణం



సమావేశంలో మాట్లాడుతున్న నాగశయనం

ప్రొద్దుటూరు కల్చరల్: తెలుగుదేశం పార్టీ బీసీ డిక్లరేషన్‌ను విస్మరించడం దారుణమని దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగశయనం పేర్కొన్నారు. స్థానిక దేవాంగ కల్యాణ మండపంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల టీడీపీ బీసీ డిక్లరేషన్‌ను ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విడుదల చేశారన్నారు. ఇందులో చేనేత, పద్మశాలి సామాజిక వర్గం కోసమని 14 హామీలు ఇచ్చారని తెలిపారు. ఈ డిక్లరేషన్ మిగతా 22 చేనేత కులాలకు వర్తించవా అని ప్రశ్నించారు. దేవాంగులను విస్మరించిన లోకేష్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో దేవాంగుల అభివృద్ధికి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి తమను గౌరవించిందన్నారు. సమావేశంలో దేవాంగ సంక్షేమ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ నరసింహారావు, అసోసియేట్ మెంబర్లు గిద్దలూరు గంగా జలంధర్, కాటం వీరప్రసాద్, రెడ్డి సుబ్బరాయుడు, కల్యాణ మండపం అధ్యక్షుడు రెడ్డి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజా శ్రేయస్సే సీఎం జగనన్న లక్ష్యం



ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు: ప్రజా శ్రేయస్సే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. జగనన్న ప్రభుత్వం ఉంటేనే ప్రజలకు యథావిధిగా సంక్షేమ పథకాలు అందుతాయని, లేకుంటే రద్దవుతాయని తెలిపారు. మండల పరిధిలోని సోములవారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని ఈశ్వర్‌రెడ్డి నగర్‌లో సోమవారం ఎమ్మెల్యే రాచమల్లు, ఆయన సతీమణి రాచమల్లు రమాదేవి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాచమల్లు ఇంటింటికి వెళ్లి జగనన్న ప్రభుత్వాన్ని మళ్లీ గెలిపించాలని కోరారు. మన ప్రభుత్వం ఉంటేనే ఇంటింటికి పింఛన్లు, సంక్షేమ పథకాలు అందుతాయని తెలిపారు. సర్పంచ్ మోపూరి ప్రశాంతి, ఎంపీపీ శేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మార్తల కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు గోటూరు బాలగురమ్మ వెంకటేష్, పల్లా లక్ష్మీదేవి, మాజీ సర్పంచ్‌లు గోపిరెడ్డి రమణయ్య, మోతుకూరు సుబ్బారావు, లాయర్ సుబ్బయ్య, సెల్ సుబ్బయ్య, ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పల్లేటి శంకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారు మునిరెడ్డి పాల్గొన్నారు.

కరెంట్ కోతపై రైతుల ధర్నా

అధికారులు తీసుకున్న నిర్ణయం వలన తమ గ్రామాల్లో పంటలు ఎండిపోవడంతో పాటు తాగునీటికి ఇబ్బంది పడుతున్నామని సోమవారం పలు గ్రామాలకు చెందిన రైతులు స్థానిక విద్యుత్ డివిజనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రోజు 9 గంటలు విద్యుత్ సరఫరా అయ్యేదని, పది రోజులుగా విద్యుత్ సరఫరాను ఐదు గంటలకు తగ్గించారని తెలిపారు. నీరు లేక పంటలు ఎండిపోవడంతో పాటు తాగడానికి ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. నంగనూరుపల్లె, రేగుళ్లపల్లె, కల్లూరు గ్రామాల పరిధిలో ఈ సమస్య ఎక్కువగా ఉందన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యే హామీతో దీక్ష విరమణ

రైతుల కోరిక మేరకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విద్యుత్ డివిజనల్ కార్యాలయానికి వచ్చి ఈఈ శ్రీనివాసులరెడ్డితో పాటు ఇతర అధికారులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల నిర్ణయం వలన ఇలా జరిగిందని, ఆ సమస్య తమ పరిధిలో లేదని ఈఈ శ్రీనివాసులరెడ్డి వివరించారు. రైతులకు ఉన్న అవగాహన అధికారులకు ఉండదని, నిశితంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు పడితే ఎలా అని ప్రశ్నించారు. వెంటనే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. రెండు రోజుల్లో యథావిధిగా విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని ఎమ్మెల్యేకు అధికారులు హామీ ఇచ్చారు. ఆ విషయాన్ని రాచమల్లు రైతులకు చెప్పడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో జేసీఎస్ జిల్లా కోఆర్డినేటర్ కల్లూరు నాగేంద్రారెడ్డి, ఇన్‌చార్జి సర్పంచ్ బాబు, నంగనూరుపల్లె శంకర్, రైతులు పాల్గొన్నారు.